క్లుప్తంగా

నేటి నుంచి సర్వపృష్ఠాప్తోర్యామ యాగం

అంబాజీపేట: తొండవరం వైనతేయ నదీతీరాన కొలువైన ఉమా తొండేశ్వర ఆలయ ప్రాంగణ సమీపాన నేటి నుంచి లోకకల్యాణం కోసం సర్వపృష్ఠాప్తోర్యామ యాగం పది రోజులు పాటు నిర్వహిస్తున్నట్లు టీటీడీ ఉన్నత వేద్యాధ్యయన సంస్థ ప్రాజెక్ట్ అధికారి దువ్వూరి ఫణి యజ్ఞేశ్వరయాజులు తెలిపారు. శనివారం ఆయన తొండవరంలోని యాగ నిర్వహణ ప్రదేశం ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చైత్ర బహుళ అమావాస్య అంటే ఈ నెల 27 వచ్చే నెల మే 8 వరకు జరిగే యాగ నిర్వహణ కర్తలగా దువ్వూరి వెంకట సూర్యప్రకాశయజ్వ, కనకదుర్గ సోమపీథిని దంపతులు వ్యవహరిస్తారన్నారు. 27 నుంచి వచ్చే నెల 7 వరకు పలు పూజల అనంతరం 8న సౌత్రామణీ యాగం, మహాదాశీర్వ చనంతో యాగం పరిసమాప్తమవుతుందన్నారు.

మందపల్లికి పోటెత్తిన భక్తులు

కొత్తపేట: మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. శనివారంతో పాటు త్రయోదశి పర్వదినం కలసి రావడంతో ఆలయానికి అత్యధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. డీసీ, ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో సిబ్బంది భక్తుల పూజలు, దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా పూజలు, తైలాభిషేకాల ద్వారా దేవస్థానానికి రూ.24,28,130, అన్నప్రసాదం విరాళాలు రూపంలో రూ.29,256తో మొత్తం రూ.24,41,386 ఆదాయం వచ్చినట్టు డీసీ అండ్ ఈఓ తెలిపారు.

ఆకట్టుకున్న రావులమ్మ జాతర

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలో వేంచేసిన గ్రామదేవత రావులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు శనివారం రాత్రి వైభవంగా జరిగాయి. పెద్ద పూలగరగను నెత్తిన ధరించిన ఆలయ అర్చకుడు చిన్న గరగల మధ్య ప్రదర్శించిన నృత్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చిన్నారులు అమ్మవారికి ప్రీతిపాత్రమైన కాగడాలను వెలగించి తమ భక్తిని చాటుకున్నారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలమూరు ఎస్సై ఎం.అశోక్ నేతృత్వంలోని పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

మూడు రోజులు విద్యుత్ అంతరాయం

రాజోలు: మూడు రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రాజోలు డివిజన్ విద్యుత్ శాఖ ఏడీఈ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో కొత్తగా ఎనిమిది ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసేందుకు విద్యుత్ నిలిపివేస్తున్నామన్నారు. రాజోలు మండలంలోని రాజోలు, తాటిపాక, శివకోడు, కడలి, వేగివారిపాలెం, పాదలాడ, సోంపల్లి, మామిడికుదురు మండలంలోని గెద్దాడ గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

అప్పనపల్లికి పూర్వ వైభవం తీసుకువస్తాం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయానికి పూర్వ వైభవం తీసుకువచ్చే దిశగా కార్యాచరణ చేపట్టామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. శివాలయం స్థలం నుంచి పాత గుడి వరకు ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.10 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ కాంక్రీట్ రోడ్డుకు ఎమ్మెల్యే శనివారం భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ ఆలయం అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా ముందుకు వెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి, ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఇన్వర్టర్‌లో తాచుపాము హల్‌చల్

మామిడికుదురు: కొమరాడ గ్రామంలో కడలి వెంకటరమణ ఇంట్లోని ఇన్వర్టర్‌లో చొరబడిన తాచుపాము శనివారం హల్‌చల్ చేసింది. ఇన్వర్టర్ బాక్సులో బుసలు కొడుతున్న శబ్దానికి ఇంట్లోని వారు బయటకు పరుగులు తీశారు. స్నేక్ క్యాచర్ వర్మకు సమాచారం ఇవ్వడంతో అతను అక్కడకు చేరుకుని తాచుపామును డబ్బాలో బంధించారు. దాన్ని తీసుకు వెళ్లి నిర్మానుష్య ప్రదేశంలో విడిచి పెట్టడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. వేసవిలో వేడికి తట్టుకోలేక విష సర్పాలు ఇళ్లలోకి చొరబడుతున్నాయని స్నేక క్యాచర్ వర్మ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఎంపీ సహకారంతో రోడ్లకు నిధులు

సఖినేటిపల్లి: స్థానిక తొమ్మిది పేటల రోడ్డు అభివృద్ధికి అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథుర్ సహకారంతో నిధులు మంజూరైనట్టు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శనివారం సఖినేటిపల్లి మార్కెట్ యార్డు వద్ద ఎంపీ నిధులు రూ.కోటి 35 లక్షలతో నిర్మించనున్న రోడ్డు పనులకు ఎంపీతో కలసి ఎమ్మెల్యే దేవ శంకుస్థాపన చేశారు. శిలాఫలకాన్ని వారు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే అభ్యర్థన మేరకు రోడ్డు పనులకు నిధులు మంజూరు చేసినట్టు ఎంపీ హరీష్ మాథుర్ తెలిపారు. కాగా సఖినేటిపల్లి లూథరన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కోనసీమ క్రికెట్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ పోటీలను కూడా వారు ప్రారంభించారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జి.పెద కాపు, సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జొన్నాడ కూడలిలో అన్నీ అవస్థలే

- పూర్తి కాని ఫ్లైఓవర్ నిర్మాణం
- రహదారుల ఆధునీకరణకు దూరం
- పట్టని ప్రయాణికుల పాట్లు



జొన్నాడ నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న సర్వీస్ రోడ్డు దుస్థితి



జొన్నాడ సెంటర్‌లో అసంపూర్తిగా ఉన్న పిల్లర్స్ పనులు

ఆలమూరు: రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా 216 ఏ జాతీయ రహదారిలోని జొన్నాడలో ఎన్‌హెచ్ఏఐ ప్యాకేజీలో భాగంగా ఫ్లైఓవర్ నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. ప్రజా ప్రతినిధుల ఉదాసీనత, ఎన్‌హెచ్ఏఐ అధికారుల నిర్లిప్తత, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల గత రెండేళ్ల నుంచి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటికే ఫ్లైఓవర్ అందుబాటులోకి రావాలని ఒప్పందం ఉన్నా ప్రశ్నించే నాథుడే లేకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. దీనివల్ల వాహనాల ఏర్పాటు చేసిన ఇరువైపులా రెండు కిలోమీటర్ల మేర ఉన్న సర్వీస్ రోడ్డు దారుణంగా దెబ్బతింది. వాహనాల రాకపోకల సమయంలో దుమ్ము, ధూళి రేగిపోయి ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారింది. ఇటీవల కాలంలో సర్వీస్ రోడ్డులో దుమ్ము పైకి లేవకుండా మంచినీటి ట్యాంకర్‌తో తడపుతున్నా ప్రయోజనం కన్పించడం లేదు. దీంతో స్థానిక ప్రజానీకం దీర్ఘకాలికంగా ఎదురు చూస్తున్న ఫ్లైఓవర్ పనులు పూర్తి కాకపోవడం, పనులు నెమ్మదించడం, సర్వీస్ రోడ్డుకు మరమ్మతులు చేయకపోవడంతో జొన్నాడ కూడలి ప్రమాదభరితంగా మారింది. ప్రయాణికులకు అన్ని అవస్థలే ఎదురవుతున్నాయి. ఫ్లైఓవర్ పనులు ప్రారంభించిన నాటి నుంచి ఇరువైపుల మార్గాల్లోని బస్టాండుల్లో ఎటువంటి మరమ్మతులను చేపట్టడం కాని సౌకర్యాలు కల్పించకపోవడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు.

మూడు నియోజకవర్గాలకు ముఖ్య కూడలి

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కొత్తపేట, మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని అనేక గ్రామాలకు ముఖ్య కూడలిగా ఉన్న జొన్నాడ సెంటర్ ప్రయాణికులకు నరకప్రాయంగా మారింది. ఈ కూడలి నుంచి అనునిత్యం వేలాది మంది ప్రయాణికులు పయనిస్తుండగా వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇరువైపులా రహదారులకు మార్జిన్ లేకపోవడంతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనివల్ల ఆర్టీసీ బస్సులు ఎక్కడ నిలపాలో తెలియని పరిస్థితి నెలకొనడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. అలాగే నిర్మాణ పనులు ఒక పద్ధతి ప్రకారం జరగకపోవడంతో వర్షాకాలంలో కొద్దిపాటి వర్షానికే ఆ ప్రాంతమంతా చిత్తడిగా మారుతుంది. దీంతో అనేక మంది వాహనదారులు ఆ బురదలో జారిపడి క్షతగాత్రులవుతున్నారు. అప్రోచ్ రోడ్డుకు అమర్చే గడ్డర్లు ఎక్కడ పడితే అక్కడ పడవేయడంతో నిర్మాణపు ప్రాంతం చిట్టడివిని తలపిస్తుంది.

ఉదాసీన వైఖరిని అవలంబిస్తున్న ఎన్‌హెచ్ఏఐ

ఆలమూరు మండలంలోని జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు వేగవంతం చేయడంపై నేషనల్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) ఉదాసీన వైఖరిని అవలంబిస్తుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫ్లైఓవర్ పనులు వల్ల వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోకపోవడం వల్ల అనేక మంది ప్రమాదాల బారిన పడుతున్నారంటూ స్థానికులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఎన్‌హెచ్ఏఐ అధికారులు ఫ్లైఓవర్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, ప్రయాణికులు తగిన సౌకర్యాలను కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. అపరిశుభ్ర వాతావరణంలో ఉన్న ఆ కూడలిని తాత్కాలికంగా అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

వేంకటేశ్వరుని ఆలయాలకు పోటెత్తిన భక్తులు



నల్లచెరువులో భక్తులతో పోటెత్తిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితులు ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్రహారతి, కుంభహారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితులు స్వామికి తులసీ పూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటిక బెల్లం తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్సిపూడి, జొన్నాడ గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాలను భక్తులు సందర్శించి వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తపారవశ్యం చెందారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను పూల, తులసి మాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు. స్థానిక ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

ఫైలేరియా గుర్తింపునకు బ్లడ్ శాంపిల్స్

సఖినేటిపల్లి: ఫైలేరియా వ్యాధి తెచ్చిపెట్టే క్రిమి ఎక్కువగా రాత్రి పూట మాత్రమే రక్తంలో తిరుగుతుందని, ఈ రీత్యా బ్లడ్ శాంపిల్స్ రాత్రి మాత్రమే తీయాలని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు ఆరోగ్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం రాత్రి మోరి పీహెచ్‌సీలో ఈ మేరకు కీటకజనిత వ్యాధుల నివారణలో భాగంగా ఫైలేరియా(బోద) వ్యాధిపైన, బ్లడ్ టెస్ట్‌పైన అవగాహన సదస్సు ఆరోగ్య సిబ్బందికి, ఏఎన్‌ఎంలకు ఆయన ఏర్పాటు చేశారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ, ఈ వ్యాధి మురికి నీటిలో గుడ్లు పెట్టి వృద్ధి చెందే ఆడ క్యూలెక్స్ దోమ వలన ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ వ్యాధి ప్రాథమిక దశలో గుర్తించి డై ఇథైల్ కార్బమెజిన్(డీఈసీ) మాత్రలు వాడడం ద్వారా దీనిని నివారించవచ్చని ఆయన అన్నారు. కాగా మోరి గ్రామంలో పీహెచ్‌సీ సిబ్బంది సహకారంతో గత రాత్రి 300 మంది నుంచి బ్లడ్ నమూనాలు సేకరించి జిల్లా ల్యాబ్‌కు పంపినట్టు సదరు అధికారి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. వైద్యాధికారులు శామ్యూల్, పూర్ణ చంద్రకుమార్, ల్యాబ్ టెక్నీషియన్, నాగరాజు, సూపర్‌వైజర్లు ప్రసాద్, మరియమ్మ, ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రకృతి'లో నవధాన్యాల సాగు తొలిమెట్టు



వానపల్లిలో నవధాన్యాల కిట్లు పంపిణీ చేస్తున్న ఏడీఏ వెంకట రామారావు

కొత్తపేట: ప్రకృతి వ్యవసాయ విధానంలో నవధాన్యాల సాగు తొలిమెట్టు అని వ్యవసాయ శాఖ స్థానిక సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీఏ) ఎం.వెంకట రామారావు అన్నారు. మండలంలోని వానపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (రుతుపవనాలకు ముందు వేసే పంట-నవధాన్యాల సాగు) విధానంలో శనివారం ఏడీఏ వెంకటరామారావు పర్యవేక్షణలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఒక ఎకరానికి 12 కేజీలు చొప్పున కిట్ తయారు చేశారు. నవధాన్యాల కిట్స్ తయారుచేశారు. ఈ కిట్స్ నందు 20 రకాల విత్తనాలు మిక్స్ చేశారు. ఏడీఏ వెంకటరామారావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం విధానంలో నవధాన్యాల సాగు అతి ముఖ్యమైనదని అన్నారు. నవధాన్యాల సాగు ప్రకృతి వ్యవసాయానికి తొలి మెట్టు అని, నవధాన్యాల సాగు వలన భూసారం పెరుగుతుందన్నారు. రైతులకు ఎరువుల వాడకం బాగా తగ్గుతుందని, కనుక ప్రతి రైతు ఈ విధానం అవలంబించాలని రామారావు సూచించారు. కొంత మంది రైతులకు కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచి గనిశెట్టి వీరేష్, వెలుగు ఏపీఎం విశ్వనాథం, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, వీపీఏలు, రైతులు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



చిరతపూడిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

కొత్తపేట: జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ ప్రాంతంలో పర్యాటకులపై దాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ కొత్తపేటలో ఆర్యవైశ్య సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిరసన వ్యక్తం చేశారు. కొవ్వొత్తులు వెలిగించి ఉగ్రదాడి మృతులకు సంతాపం తెలియజేశారు. స్థానిక పాతబస్టాండ్ నుంచి దేవీ సెంటర్ వరకూ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా, మండల ఆర్యవైశ్య సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మలికిపురం: కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ మలికిపురం, సఖినేటిపల్లి మండలాల ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో శనివారం మలికిపురంలో మానవహారం నిర్వహించారు. మతం పేరుతో మారణ హోమం సృష్టించడం దారుణమని ఖండించారు. ఎంఈఓలు ఎం.విజయశ్రీ, వైవీ సత్యనారాయణ, ఎం.వెంటేశ్వరరావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కట్టా చంద్రశేఖర్, ఎ.మోహన్, ఎ.రామకృష్ణ, జి.శ్రీనివాస్, వీఎస్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి అమానుషమని పలువురు వక్తలు పేర్కొన్నారు. చిరతపూడిలో కృష్ణ ధర్మ రక్షణ ఆధ్వర్యంలో తీవ్రవాదుల దాడికి నిరసనగా శనివారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ భారత్‌పై ఉగ్రదాడులను ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్‌పై కేంద్రం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉగ్రవాదులు సామాన్య ప్రజల ప్రాణాల తీయడం దారుణమన్నారు. దేశమంతా ప్రశాంతంగా ఉండటం ఉగ్రవాదులకు ఇష్టం లేకనే ఈ దాడికి పాల్పడ్డారన్నారు. ముష్కరులు కుట్ర పూరితంగా దాడి చేసి, అమాయక ప్రజలను పొట్టన పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉగ్రవాదాన్ని అరికట్టడానికి భారత ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

మే నాలుగు నుంచి సంవిధాన్ బచావో కార్యక్రమం

మామిడికుదురు: మే నాలుగో తేదీ నుంచి రాజ్యాంగాన్ని రక్షించాలన్న నినాదంతో సంవిధాన్ బచావో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు తెలిపారు. నగరం పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఏఐసీసీ ఆదేశాల మేరకు మే 4, 5 తేదీల్లో సంవిధాన్ బచావోలో భాగంగా ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సీనియర్ నేతలు పాల్గొన్నారు.

నాచుసాగుతో పర్యావరణానికి మేలు



నాచుసాగు యూనిట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

మామిడికుదురు: చెరువు ఆధారిత సముద్రపు నాచుసాగు వల్ల పర్యావరణానికి, వ్యవసాయ అనుబంధ రంగాలకు ఎంతో మేలు జరుగుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. కరవాక గ్రామంలో శనివారం సీవీడ్జ్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన ఫారం పాంట్స్ ఫిష్ పాంట్స్ చెరువులను ఆయన అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సాగు ద్వారా వచ్చే సముద్రపు నాచుకు భవిష్యత్తులో మంచి డిమాండ్ ఏర్పడుతుందన్నారు. వ్యవసాయానికి సేంద్రియ ఎరువులుగాను, పశువులకు గ్రాసంగాను, చేపటలకు, కోళ్లకు దాణాగాను, కాస్మొటిక్స్ రంగాలతో పర్యావరణ హితమైన ఉత్పత్తులను అందిస్తుందన్నారు. ప్రకృతి అందించే అద్భుత పంట అయిన సముద్రపు నాచుశక్తిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి హరిరామరాజు, ఉద్యాన అధికారి బీవీ రమణ, ఎమ్మార్వో సుబ్రహ్మణ్యంఆచార్యులు, ఎల్‌డీఎం కేశవవర్మ, జిల్లా మత్స్యశాఖ అధికారి పీవీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

టూరిజంతో మహిళా సంఘాల అనుసంధానం



సమావేశంలో మాట్లాడుతున్న రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, పాల్గొన్న అధికారులు

మలికిపురం: జిల్లాలో టూరిజం అవకాశాలు పుష్కలంగా ఉన్న కారణంగా మహిళా సంఘాలను అనుసంధానం చేసి వారికి ఉపాధి అవకాశాలు మెరుగు పరుస్తున్నట్లు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. శనివారం రాజోలు నియోజకవర్గ స్థాయిలో వెలుగు సిబ్బంది, మహిళా సంఘాలతో మలికిపురం ఎంపీడీఓ కార్యాలయంలో సమన్వయ సమావేశం జరిగింది. డీఆర్‌డీఏ, ఏపీ టూరిజం, సెర్ప్ అధికారుల సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో మహిళలకు టూరిజం ద్వారా ఉపాధి కల్పన అంశాలపై చర్చించారు. దిండి కేంద్రంగా జిల్లాకు అనేక ప్రాంతాల నుంచి టూరిస్టులు వస్తున్నారని వారికి మౌలిక వసతులు, స్థానిక ఆహార వంటకాలు అందించడం ద్వారా ఉపాధి పొందవచ్చని ఎమ్మెల్యే అన్నారు. డీఆర్‌డీఏ పీడీ జయచంద్రగాంధీ మాట్లాడుతూ పర్యాటకులకు గైడ్‌గా వ్యవహరించడంతో పాటు హోంస్టే కోసం ఇళ్లను అద్దెకు ఇవ్వడం ద్వారా ఆదాయం పొందవచ్చని సూచించారు. ఇందుకు ఆసక్తి గల వారిని ఎంపిక చేసి పేర్లు నమోదు చేశారు. టూరిజం శాఖతో అనుసంధానమై ఈ కార్యక్రమం విజయవంతమయ్యేలా కార్యాచరణ రూపొందించారు. సెర్ప్ అసిస్టెంట్ డైరెక్టర్ సరళి, ఏపీ టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ లాజ్‌వంతి నాయుడు, కన్సల్టెంట్ సామీతీ దేవి తదితరులు మాట్లాడుతూ గోదావరి జిల్లాలలో ప్రకృతి అందాలతో పాటు, ఇక్కడ పండే కొబ్బరి, కోనసీమ వంటకాలు, టూరిస్టులకు అందించి ఆదాయం పొందవచ్చని అన్నారు. అంతేకాక సముద్ర బీచ్‌లు, టెంపుల్ టూరిజం కూడా ఇక్కడ అందుబాటులో ఉందన్నారు. పర్యాటకులకు, యాత్రికులకు అందుబాటు ధరలతో అకామిడేషన్, ఆహారం, గైడింగ్ సేవలు అందించి ఉపాధి అవకాశాలు ఏర్పరచుకోవచ్చని పేర్కొన్నారు. ఎంపీపీ మేడిచర్ల వెంకటసత్యవాణి, జెడ్పీటీసీ బల్ల ప్రసన్న కుమారి, ఏపీఎం రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే



మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పదో తరగతి పరీక్షల్లో మానేపల్లి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని ఏడిద లాస్యప్రియ 582, ఆర్.ఏనుగుపల్లికి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 580, పి.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని సుంకర నాగచైతన్య 572 మార్కులతో మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ ద్వితీయ స్థానాన్ని సాధించారు. వీరిని పి.గన్నవరంలోని తన కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే గిడ్డి అభినందించారు. విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంఈఓలు హెలీనా, చింతా వీరభద్రానందం తదితరులు పాల్గొన్నారు. అలాగే పి.గన్నవరం లిటిల్ ఏంజెల్స్ స్కూలుకు చెందిన యర్రంశెట్టి అమృత 588 మార్కులు సాధించినట్టు ప్రిన్సిపల్ జోమి వర్గీస్ తెలిపారు. అమృతను వివేకానంద యూత్ అధ్యక్షుడు బొరుసు చంద్రశేఖర్ తదితరులు అభినందించారు.

పదిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం

రాజోలు: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ చూపిన రాజోలు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులను శనివారం సత్కరించారు. ప్రధానోపాధ్యాయిని కె.సరస్వతి, ఎస్ఎంసీ చైర్మన్ పెసింగి ఏసుబాబు ఆధ్వర్యంలో 534 మార్కులతో పాఠశాల మొదటి స్థానం సాధించిన యిల్లింగి నాగ సూర్య హిమంత్‌తో పాటు టాప్ టెన్ విద్యార్థులను సత్కరించి స్వీట్స్ బాక్స్ అందజేశారు. అలాగే రెండు చేతులు వైకల్యం ఉన్నా 291 మార్కులు సాధించిన ప్రత్యేక అవసరాల కలిగి విద్యార్థి చెల్లుబోయిన బాబిని సత్కరించారు. కమిటీ సభ్యులు జొన్నలగడ్డ గోపాలకృష్ణ, బారం రాజా, హైమవతి తదితరులు పాల్గొన్నారు.

హారికకు రవాణా అధికారి ప్రశంస



హారికను అభినందిస్తున్న శ్రీనివాసరావు

మలికిపురం: మలికిపురం మండలం, ఇరుసుమండ గ్రామంలో విరిసిన విద్యా కుసుమం ప్రభుత్వ పాఠశాలలో చదివి పదో తరగతి పరీక్షల్లో 592/600 మార్కులు సాధించిన విద్యార్థిని కోళ్ల హారికను జిల్లా రవాణా ధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు శనివారం అభినందించారు. శాలువాతో సన్మానించిన అనంతరం ఆయన నీ లక్ష్యం ఏంటని చిన్నారిని ప్రశ్నించగా ఐఏఎస్ అవ్వడమే నా జీవితాశయమని చెప్పింది. ఈ విద్యార్థిని తండ్రి తాపీమేస్త్రిగా పనిచేస్తున్నారు. ఈ ఘనత సాధించిన విద్యార్థిని స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన ఇతర విద్యార్థులకు సూచించారు.

వడగాడ్పులకు గురికాకుండా పనులు చేసుకోవాలి

అంబాజీపేట: జాతీయ ఉపాధి హామీ పథకంలో పనులు చేపెట్టే ఉపాధి కూలీలు వడగాడ్పులకు గురి కాకుండా పనులు చేసుకోవాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. మాచవరం శివాలయం వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం ఎంపీపీ పరిశీలించారు. ఆయన మట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న బీమాను ప్రతి ఉపాధి కూలీ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఉపాధి పనులు చేయాలన్నారు. అధిక ఉష్ణోగ్రతలు ఉన్న నేపథ్యంలో పనికి వచ్చే కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అడిగిన ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించాలన్నారు. వంద రోజులు పని దినాలు పూర్తి చేసుకునేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాగాబత్తుల సుబ్బారావు, మట్టా వెంకటేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



గొందిలో అంబేడ్కర్ విగ్రహానికి గజమాల వేస్తున్న గొల్లపల్లి

సఖినేటిపల్లి: గొంది గ్రామంలో శనివారం స్థానిక శాంతి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆవిష్కరించారు. అలాగే కమ్యూనిటీ హాల్‌ను ఆయన ప్రారంభించారు. అంబేడ్కర్ విగ్రహానికి గజమాలను మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, ఎంపీపీ వీరా మల్లిబాబు, వైస్ ఎంపీపీ-1 కొల్లాబత్తుల శుభాకర్ అలంకరించారు. మరో ముఖ్య అతిథి మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, సర్పంచ్ దొండపాటి రవికుమార్, ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. నాయకులు పాల్గొన్నారు.

స్వామివారి సన్నిధిలో ఎమ్మెల్సీ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో శనివారం ఎమ్మెల్సీ అనంతబాబు కుటుంబ సభ్యులతో కలసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత అంతర్వేది బీచ్‌లో పుణ్యస్నానం ఆచరించి, లక్ష్మీనరసింహస్వామికి, రాజ్యలక్ష్మి అమ్మవారికి వారు పూజలు చేశారు. పూజల అనంతరం అర్చకులు వారికి ఆశీర్వచనలు పలికి, లడ్డూ ప్రసాదాలను అందజేశారు. కాగా స్థానిక టూరిజం గెస్ట్‌హౌస్ వద్ద ఎమ్మెల్సీ అనంతబాబును నగరం మాజీ సొసైటీ అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్య, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకుడు సలాది సతీష్, ఎంపీటీసీ వర్ధినేని రాము మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఎమ్మెల్సీ దంపతులను శాలువాతో వారంతా సత్కరించారు.

దళితులపై నిర్లక్ష్య వైఖరి తగదు

మలికిపురం: పిఠాపురంలో దళితులపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి తగదని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. శనివారం మలికిపురంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన వైఎస్సార్ సీపీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిఠాపురంలో దళితులకు న్యాయం చేయాలని కోరారు. పార్టీ కమిటీల నియామకం, కూటమి పాలనలో సంక్షేమ పథకాలు అమలు కాకపోగా అన్ని వర్గాలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం పార్టీ భవిష్యత్తు కోసం ప్రణాళికలపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో పార్టీ జనరల్ సెక్రటరీ నల్లి డేవిడ్, జిల్లా కార్యదర్శి ఈద రవిరెడ్డి, కొల్లాబత్తుల సతీష్ బాబు, గుర్రం జాషువా, వివిధ ఎస్సీ విభాగాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నడక దారి ఆక్రమిస్తున్నారని ఫిర్యాదు

రాజోలు: నడక దారిని ఆక్రమిస్తున్నారని సఖినేటిపల్లి మూడు తూముల ప్రాంతానికి చెందిన కొందరు మహిళలు శనివారం రాజోలు కోర్టు కాంప్లెక్స్‌లోని మండల న్యాయ సేవాధికార సంస్థలో ఫిర్యాదు చేశారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలరాణికి సమస్యను వివరించారు. ఏడు దశాబ్దాలుగా 11 కుటుంబాల వారు పంటబోదె వినియోగంలో లేకపోవడంతో నడకదారిగా మార్చుకుని రాకపోకలు సాగిస్తున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. నడక దారిని మూసివేసి కందికట్ల ప్రభుదాసు ప్రహరీ నిర్మాణం చేస్తున్నారన్నారు. గొల్లమందల రాజేష్, ఇంజేటి రూప, గొల్లమందల జ్యోతి, సరోజని, ఇంజేటి రజని, గెద్దం భానుప్రసాద్ తదితరులు ఫిర్యాదు చేశారు.

అలరించిన బాలల నృత్య ప్రదర్శన

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి క్షేత్రంలో ప్రతి శనివారం రాత్రి ధర్మపథం కార్యక్రమంలో భాగంగా వివిధ సంప్రదాయ నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు గ్రామానికి చెందిన కూచిపూడి, భరతనాట్యం కళాకారిణులు, యామిని సిస్టర్స్ నృత్య రూపకాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలు భక్తులను విశేషంగా అలరించాయి. కళాకారిణులు, నాట్య గురువులను దేవదాయ-ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు, పలువురు ప్రముఖులు అభినందించి, ఘనంగా సత్కరించారు.

అంబేడ్కర్ సేవలు అమూల్యం



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీపీ వనజకుమారి, గణేష్‌బాబు

మామిడికుదురు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఈ దేశానికి అందించిన సేవలు అమూల్యమైనవని ఎంపీపీ కుసుమ వనజకుమారి, వైఎస్సార్ సీపీ నేత నీతిపూడి గణేష్‌బాబు పేర్కొన్నారు. ఈదరాడ గ్రామంలోని సిద్ధార్థపేటలో శనివారం అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ దేశానికి అందించిన సేవలను వక్తలు కొనియాడారు. దళిత నేత నల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి, గోసంగి చిన్నబాపూజీ, బొంతు మణిరాజు, కుసుమ పెరుమాళ్లకుమార్, ప్రసాద్, కుసుమ శ్రీధర్, యన్నాబత్తుల చిన్న, హర్ష, సిద్ధార్థ యూత్ సభ్యులు పాల్గొన్నారు.